క్లుప్తంగా

పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా పూర్ణయ్య



మాచవరం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన పాలకవర్గ చైర్ పర్సన్‌గా పసుపులేటి పూర్ణయ్య ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో చైర్ పర్సన్‌తో పాటు సభ్యులుగా పట్లవీటి బూరె సైదా, బాణావత్ కోటేశ్వరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ వెంకయ్య పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌పై టీడీపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ అశోక్‌కుమార్



పిడుగురాళ్ల: జూనియర్ ఎన్‌టీఆర్‌పై టీడీపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదని వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన సెల్ఫీ వీడియో విడుదల చేశారు. అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే జూనియర్ ఎన్‌టీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు అసభ్యకరమే కాకుండా, సమాజంలో ఉన్న ప్రతి తల్లిని అవమానించే స్థాయిలో ఉన్నాయని చెప్పారు. ఒక రాజకీయ నేత స్థాయికి మించి ఈ రకమైన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి, తెలుగు సంస్కృతికి మచ్చ తెస్తుందన్నారు. ఎవరి తల్లినైనా రాజకీయ వేదికలపై అవమానించడం నాయకత్వం కాదని, బలహీనతకు నిదర్శనమని హితవు పలికారు.

నేడు దివ్యాంగ పిల్లలకు ఉచిత శిబిరం

పిడుగురాళ్ల: నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ పిల్లలకు జెడ్పీ హైస్కూల్‌లో ఉపకరణాల శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని చెప్పారు. హాజరైన వారికి ఉచితంగా భోజనం, టీ, స్నాక్స్‌లు ఇవ్వటం జరుగుతుందని పేర్కొన్నారు. 2 పాస్ ఫొటోలు, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా తీసుకొని రావాలని కోరారు. వివరాలకు 8978580789 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా జనార్ధన్



పిడుగురాళ్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారిగా ఆవుల జనార్ధన్ సోమవారం ఎన్నికయ్యారు. జిల్లా క్రీడ సాధికార సంస్థ పి.నరసింహారెడ్డి, శ్రీకాకుళం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ రమణబాబు, ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ కో ఆర్డినేషన్ సామంత రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలలో పిడుగురాళ్ల స్కాలర్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆవుల జనార్ధన్‌ని ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆవుల జనార్ధన్‌ను స్కాలర్స్ విద్యా సంస్థల డైరెక్టర్ జి. శ్రీనివాస్‌రెడ్డి, మూలగుండ్ల జగదీష్‌రెడ్డి అభినందించారు.

చలో కరేడును అడ్డుకోవడం దారుణం

నరసరావుపేట: నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో రైతుల నుంచి బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా సోమవారం రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల సంయుక్త పిలుపు మేరకు తలపెట్టిన సభను అనుమతి లేదంటూ సెక్షన్ 144, సెక్షన్ 30 అమలులో ఉందంటూ అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యతిరేకమని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ విమర్శించారు. ఈ మేరకు జిల్లా కార్యాలయం నుంచి సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల వద్ద నుంచి భూములు బలవంతంగా గుంజుకుంటుందనే విషయం చలో కరేడు సందర్భంగా జరిగిన అక్రమ అరెస్టులు విదితం చేస్తున్నాయని పేర్కొన్నారు. పోలీసులు కరేడు గ్రామాన్ని తమ గుప్పెట్లోకి తీసుకుని బయట వ్యక్తులు రాకుండా గ్రామంలోకి వెళ్లే అన్ని మార్గాలను మూసివేయడం, వాహనాలను తనిఖీ చేయడం, గ్రామ సచివాలయాల వద్ద, ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు సాధారణ వ్యక్తుల మాదిరి తిరుగుతూ ప్రజల కదలికలపై నిఘా ఉంచడం ప్రజా స్వేచ్ఛను హరించడమేనన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలు, ప్రజా సంఘాలు తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎన్డీఏ కూటమిలో భాగమైన బీజేపీ నిరంకుశ పోకడలకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కరేడు రైతుల అభిప్రాయాలను గౌరవించి బలవంతంగా భూములు సేకరించాలనే ఆలోచన విరమించుకోవాలని, అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బలవంతంగా భూసేకరణ చేయాలని చుస్తే కరేడు రైతులకు అండగా నిలిచి రైతులను ఏకం చేసి రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

టీటీడీ కల్యాణ మండపం కళ తప్పింది..

- అధ్వానంగా నిర్వహణ
- ఆధునికీకరణకు చర్యలు లేవు
- ప్రజలకు దూరమవుతున్న మండపం
- ప్రైవేటు వ్యక్తులకు నిర్వహణ అప్పగించిన ఫలితం శూన్యం
- పట్టించుకోని అధికారులు



పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం

పిడుగురాళ్ల: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పిడుగురాళ్ల పట్టణంలో సుమారు 15 ఏళ్ల క్రితం టీటీడీ కల్యాణ మండపం నిర్మించారు. ప్రజలకు మండపం అందుబాటులోకి తీసుకొచ్చే ఉద్దేశంతో నిర్మించారు. ఆ సమయంలో ప్రైవేటు ఫంక్షన్ హాల్స్ తక్కువగా ఉన్నాయి. దీంతో అందరికీ వేదికైంది. ఐదారేళ్ల మండపాన్ని ప్రజలు ఫంక్షన్ల కోసం వినియోగించుకున్నారు. ఇటీవలే పట్టణంలో ఏసీ కల్యాణ మండపాలు ఎక్కువ వచ్చాయి. దీనికి తోడు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

వసతులు లేకపోవడంతో...

టీటీడీ కల్యాణ మండపంలో శుభ కార్యాలయాలు జరగకపోవటం వలన ప్రాంగణమంతా పిచ్చిచెట్లతో నిండిపోయింది. గోడలన్నీ రంగులు వెలిసి చూసేందుకు పురాతన భవనంలా మారింది. అలాగే ఈ కల్యాణ మండపంలో ఏసీ సౌకర్యం లేకపోవటంతో మండపం వైపు ఎవరు మొగ్గు చూపటం లేదు.

ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చినా ఫలితం లేదు...

పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం సక్రమంగా నిర్వహించకపోవటంతో ప్రైవేటు వ్యక్తులకు ఒక ఏడాదికి రూ.4 లక్షల చొప్పున టీటీడీ లీజుకు ఇచ్చింది. అయినా ప్రైవేటు వ్యక్తులు నిర్వహణ చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. ఫంక్షన్ల నిర్వహణకు ప్రజలు ఆసక్తి చూపకపోవడంతో గిట్టుబాటు కాకపోవటంతో మా లీజు రద్దు చేయండి అంటూ టీటీడీ బోర్డుకు లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

సామాన్యులకు అందుబాటులో ఉంటే....

పేద, మధ్య తరగతి వ్యక్తులు ఘనంగా శుభకార్యాలు చేసునేందుకు టీటీడీ కల్యాణ మండపాన్ని ఈ ప్రాంతంలో నిర్మించటం జరిగింది. కాలక్రమేనా ప్రతి ఒక్కరూ సౌకర్యాలకు అలవాటు పడుతున్నారు. ఇటువంటి తరుణంలో పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపాన్ని కూడా నూతన హంగులతో ఏసీ సౌకర్యాన్ని కల్పిస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పుడు ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుభకార్యాలు నిర్వహించాలంటే లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అదే టీటీడీ కల్యాణ మండపంలో సౌకర్యాలు కల్పిస్తే సామాన్యులకు అందుబాటు ధరలో ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. ఈ విషయమై టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ ఆంజనేయులను 'సాక్షి' వివరణ కోరగా త్వరలోనే టీటీడీ బోర్డు ఆధీనంలోకి రానుందని చెప్పారు. ఇటీవల టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి పరిశీలించి వెళ్లారు. వసతులపై బోర్డుకు నివేదించే అవకాశం ఉందని చెప్పారు.

విద్యుత్ శాఖ విస్తృత తనిఖీలు



తనిఖీల్లో పాల్గొన్న విద్యుత్ సిబ్బంది

ముప్పాళ్ల: విద్యుత్ శాఖ విజిలెన్స్ ఆపరేషన్స్ విభాగం ఆధ్వర్యంలో మండల పరిధిలోని దమ్మాలపాడు, ఇరుకుపాలెం, బొల్లవరం, గోళ్ళపాడు, తురకపాలెం, చాగంటివారిపాలెం, రుద్రవరం, తొండపి గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారని ఈఈ (విజిలెన్స్) డీపీఈ సీహెచ్ కోటేశ్వరరావు, ఆపరేషన్స్ ఈఈ రాంబట్లు సోమవారం తెలిపారు. తనిఖీల్లో మీటరు లేకుండా విద్యుత్ వాడుతున్న 8 మందికి రూ.13 వేలు, అక్రమంగా విద్యుత్ చౌర్యంకు పాల్పడుతున్న 10 మందికి రూ.1.55 లక్షలు, ఇతర కేటగిరీలో వాడుకుంటున్న ఐదుగురికి రూ.20 వేలు, అదనపు లోడ్ వాడుతున్న 114 మందికి రూ.4.60 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి..

వినాయకచవితి సందర్భంగా నిర్మించే మండపాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, లోడ్‌కు తగిన డీడీ చెల్లించాలని విద్యుత్ ఏఈ సుచరిత తెలిపారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263, 9440812360, 9440812361 నంబర్‌లకు అందించవచ్చన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీల్లో డీఈఈలు రవికుమార్, ఎస్.మల్లికార్జునప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, జి.సుచరిత, ఆపరేషన్స్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేస్తే మన్ననలు

అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మల్లికార్జునరావు



కమిషనర్ ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న విజ్ఞాన సమితి అధ్యక్షుడు మల్లికార్జునరావు

సత్తెనపల్లి: అంకిత భావంతో పని చేసే ఉద్యోగులకు ఎల్లప్పుడూ ప్రజల నుంచి మన్ననలు లభిస్తాయని అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మాడా మల్లికార్జునరావు అన్నారు. పుర ప్రజలకు ఉత్తమ సేవలందించిన మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అభ్యుదయ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్ ఆనంద్ కుమార్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసే వారిని ప్రజలు ఎప్పుడు ఆదరిస్తారని, ప్రజల మన్ననలు పొందుతారన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించి, కమిషనర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అభ్యుదయ విజ్ఞాన సమితి బాధ్యులు కూనాగు వెంకటేశ్వర్లు(బుజ్జి), పిల్లుట్ల ఆంజనేయులు, పణిదరపు నరసింహారావు, టైలర్ ఖాజావలి, పులిపాటి సైదయ్య, రాజుపాలెం సైదారావు, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రంగారెడ్డిపాలెం ఐక్యతను దెబ్బతీసే కుట్ర

- డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలోనే గ్రామాభివృద్ధి
- అభివృద్ధి పనుల్లో ఎలాంటి అవినీతి జరగలేదు
- మోసగాళ్లు చెప్పే మాటలు నమ్మవద్దు
- రంగారెడ్డిపాలెం గ్రామస్తులు



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

నరసరావుపేట రూరల్: గ్రామ ఐక్యతను దెబ్బతీసి అభివృద్ధిని అడ్డుకునే కుట్ర జరుగుతుందని రంగారెడ్డిపాలెం వాసులు తెలిపారు. గత 70 సంవత్సరాలుగా ఏ నాయకుడు గ్రామానికి సహాయం చేయలేదన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. మోసాలకు పాల్పడే వ్యక్తి చెప్పే మాటలు నమ్మవద్దని సూ చించారు. గ్రామంలోని కల్యాణ మండపం వద్ద గ్రామస్తులు సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిపై చేసిన ఆరోపణలపై వారు స్పందించారు. గ్రామంలోని వారు శుభాకార్యాలు నిర్వహించుకునేందుకు వేదిక లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామస్తులు అందరం కమిటీగా ఏర్పడి కల్యాణమండపం నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారని వివరించారు. గ్రామంలోని వారితో పాటు ఉద్యోగాలు, వ్యాపారాలలో బయట ప్రాంతాల్లో ఉన్న వారు, ఎన్ఆర్ఐలు కూడా చందాలు ఇచ్చారని తెలిపారు. గ్రామానికి చెందిన దొండెటి అచ్చిరెడ్డి 30 సెంట్ల స్థలాన్ని కల్యాణ మండపానికి అందజేసారని పేర్కొన్నారు. దాదాపు రూ.70 లక్షలు చందాలు వచ్చాయని, మిగిలిన పనులకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని సహకారం కోరినట్టు తెలిపారు. సిమెంట్, ఇసుక, గ్రానైట్ రూపంలో డాక్టర్ గోపిరెడ్డి సహకారం అందించారని వివరించారు. ప్రభుత్వ భూమిని బీసీలు కొంతకాలంగా సాగు చేసుకుంటున్నారని, జగనన్న కాలనీ కోసం ఆ భూమిని సేకరించడం జరిగిందన్నా రు. భూమిని ఇచ్చిన బీసీలకు న్యాయం చేస్తా మని హామీ ఇచ్చినట్టు తెలిపారు. డాక్టర్ సహకారంతో రంగారెడ్డిపాలెం– ఇస్సపాలెం గ్రామా ల మధ్య కాజ్‌వేను నిర్మించుకున్నామని వివరించారు. 200 సంవత్సరాల చరిత్ర ఉన్న రంగారెడ్డిపాలెంను గతంలో ఏ నాయకుడు పట్టించుకోలేదన్నారు. రంగారెడ్డిపాలెం గ్రామానికి ఉన్న మంచి పేరు ఉందని, ఈ రోజు కొందరి వల్ల ప్రతిష్ట దెబ్బతినే పరిస్థితి వచ్చిందన్నారు. గ్రామంలోని అభివృద్ధి పనులపై ఆరోపణలు చేసిన వెంకటేశ్వరరెడ్డి చరిత్ర అందరికి తెలుసన్నారు. నిరుద్యోగులను, ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని ఎంతో మందిని మోసం చేసి కేసులు ఎదుర్కుంటున్నారని గుర్తు చేశారు. గ్రామస్తులందరం వెంకటేశ్వరరెడ్డి ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

నరసరావుపేట: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ప్రవేశద్వారం ఎదుట రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బీఎస్పీ నాయకులు ధర్నా నిర్వహించి పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని, బీసీలకు రాజ్యాధికారం బహుజన్ సమాజ్ పార్టీ ద్వారానే సాధ్యం అన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు కంభంపాటి నాగ వంశీ, వేల్పుల రాంబాబు, సత్తెనపల్లి అధ్యక్షులు దేవానంద్, కోటేశ్వరావు, మల్లేశ్వరరావు, చిలకలూరిపేట నాయకులు రమణయ్య, వందనం,షేక్ ఆదం సాహెబ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికపై బాలుడి లైంగిక వేధింపులు

పెదకూరపాడు: బాలికపై బాలుడు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనపై పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలికను అదే గ్రామానికి చెందిన బాలుడు ప్రేమిస్తున్నానని వెంటపడుతూ, మెసేజీలు పెడుతూ, ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడని బాధితురాలి తల్లి మేడ బాజీకి తెలపగా బాజీ పెదకూరపాడు పోలీసులను ఆశ్రయించింది. బాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గిరిబాబు తెలిపారు.

ఓటర్ల దరఖాస్తులను వెంటనే పరిశీలించాలి



ముప్పాళ్ల: దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ కె.నగేష్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల బదిలీలపై వెళ్లిన వారి స్థానంలో నూతన బీఎల్‌ఓలకు బాధ్యతలు అప్పగించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో అందిన అర్జీలతో పాటు గ్రామ సచివాలయాల ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ బాలవెంకటేష్, ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు, బీఎల్ ఓలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి వివిధ పుష్పాలతో ప్రత్యేక పూజలు



రాజుపాలెం: మండల కేంద్రమైన రాజుపాలెంలో వేంచేసి ఉన్న పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం నాల్గవ రోజు స్వామి వారికి వివిధ పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 50 కేజీలు కలిగిన చామంతి, గులాబి, లిల్లీ, మల్లె, కాగడామల్లె తదితర పుష్పాలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. వారికి తీర్థప్రసాదాలను అందించారు. దేవస్థాన వ్యవస్థాపకులు, బాలాజీ ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకటరమసుబ్బారావు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన సత్యహరిశ్చంద్ర పద్య నాటకం చూపరులను ఆకట్టుకుంది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవు

కమిషనర్ ఆనంద్‌కుమార్



సత్తెనపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎస్బీఐ ప్రాంతంలో మున్సిపల్ కార్మికులు చేపడుతున్న చెత్త తొలగింపును సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెత్త చెదారాన్ని రోడ్లపై, డ్రైనేజీల్లో పడవేయకుండా మున్సిపల్ కార్మికులకు అందించాలన్నారు. ముఖ్యంగా పాలిథిన్ కవర్లను నిషేధించి చేతి సంచులను వాడాలన్నారు. దీనివల్ల చాలా వర కు డ్రైనేజీల్లో చెత్త చెదారం నిల్వ ఉండకుండా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను సందర్శించి అక్కడ అందుతున్న ఆహార పదార్థాల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి తదితరులు ఉన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన తహసీల్దారు శ్రీనివాసరావు



తాడువాయి వద్ద నది ఉధృత

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి 3 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీటిని విడుదల చేయడంతో దిగువ కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు కుంభా శ్రీనివాసరావు దండోరా, దేవాలయాలలో మైకులు ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. చేపలు పట్టే వారిని నదిలోకి వెళ్లనీయకుండా నదీ తీరాల వద్ద గ్రామ సహాయకులను కాపలా ఉంచారు. నదిపై నుంచి పడవలు, బల్లకట్టు ప్రయాణాలను నిలిపి వేశారు. ప్రాజెక్టు దిగువకు సోమవారం రాత్రికి ఇంకా వరద నీటిని వదిలే అవకాశాలున్నందున నదీ తీరప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు తెలిపారు. అవసరాన్ని బట్టి పునరావాస చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ప్రయాణికుల ఎదురుచూపులు



పిడుగురాళ్ల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల దుస్థితి

పిడుగురాళ్ల: ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. స్త్రీశక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం చేపట్టిన ప్రభుత్వం తగిన విధంగా సర్వీసులు ఏర్పాటు చేయడంలో విఫలమైంది. బస్టాండ్‌లో ప్రయాణికులు వందల సంఖ్యలో ఎదురుచూస్తున్నారు. గంటల తరబడి వేచిఉండాల్సిన దుస్థితి. ఉన్నా బస్సు వస్తుందో రాదో తెలియని పరిస్థితి. దీనికి తోడు మూడు రోజులు వరుసగా సెలవులు వచ్చింది. శుభకార్యాలు ఉండడంతో వివిధ ప్రాంతాలకు చెందిన బస్సులను అటు తరలించినట్లు సమాచారం. స్వగ్రామాలకు చేరుకున్న విద్యార్థినీ, విద్యార్థులతో పాటు వివిధ వర్గాలకు చెందిన ప్రజలు గమ్యస్థానాలకు చేరేందుకు బస్సులను ఆశ్రయిస్తున్నారు. పట్టణంలోని గుంటూరు బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం వద్ద, కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న బస్ షల్టర్‌వద్ద ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది.

మిర్చి పెంపకంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఏఓ ఎస్‌కే అహ్మద్



మిర్చి నారు నాటుతున్న రైతులు

అమరావతి: మండలంలో ఇప్పుడిప్పుడే మిరప నారు నాటుతున్న రైతులు కలుపు నివారణకు నాటడానికి 1, 2 రోజులు ముందు ఎకరానికి 200 లీ.నీటిలో 1.5 లీ. పెండీమిథాలిన్ 30 శాతం కలిపి పిచికారీ చేయాలని ఏవో ఎస్‌కే అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన మిర్చి రైతులకు సూచనలిస్తూ మిరప నారు నాటిన 15 నుంచి 20 రోజులలో రెండు మూడు సార్లు అంతరకృషి చేయాలన్నారు. అంతరకృషి సాధ్యం కాకపోతే 200 లీటర్ల నీటిలో క్విజలాఫాస్ఇథైల్ 5 శాతం కలిపి పిచికారీ చేస్తే గడ్డి జాతి మొక్కలను నిర్మూలించవచ్చన్నారు. పైరుపై పేనుబంక నివారణకు ఎకరానికి 400 మిల్లీలీటర్ల మిథైల్ డెమెటాన్, 300 గ్రాముల ఎసిఫేట్ చొప్పున పిచికారీ చేయాలన్నారు. రైతులు ఇలాంటి జాగ్రత్తలు పాటించినట్లయితే మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయన్నారు.

వీఏఏలు, వీహెచ్ఏల భాగస్వామ్యం తప్పనిసరి

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి

సత్తెనపల్లి: ప్రకృతి సాగులో వీఏఏలు, వీహెచ్ఏల భాగస్వామ్యం తప్పనిసరని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి స్పష్టం చేశారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్ కేంద్రంలో పెదకూరపాడు, సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాల వీఏఏలు, వీహెచ్ఏలు, సిబ్బందికి మూడు రోజుల ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమంలో సోమవారం శిక్షణను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో అధిక రసాయనాల వాడకంతో భూమి సారం తగ్గిపోతుందన్నారు. భూమి ఆరోగ్యం దెబ్బతింటూ రైతులు నష్టపోతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం ఆచరించాలని, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు వీఏఏలు, వీహెచ్ఏలు ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. జిల్లా రిసోర్స్‌పర్సన్ కె.రామచందరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అనేది ఒక మోడల్ సైన్స్ అని, భూమిని 365 రోజులు కప్పి ఉంచితే భూమికి నిరంతరం కర్బనం అంది, సారవంతం అవుతుందన్నారు. రైతులు జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవాలంటే ఏ-గ్రేడ్ ఏటీఎమ్ మోడల్స్‌ను అవలంబించాలన్నారు. సత్తెనపల్లి ఏడీఏ బోయపాటి రవిబాబు మాట్లాడుతూ రసాయనాలు వదిలి ప్రకృతి పద్ధతుల్లో పంటలు పండించడం వలన భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ విధానంలో పండిన పంటలు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారం అందిస్తాయన్నారు. భవిష్యత్తు తరాలకు పర్యావరణాన్ని కాపాడే శక్తి ప్రకృతి వ్యవసాయానికి ఉందన్నారు. కార్యక్రమంలో ఏవోలు బి.సుబ్బారెడ్డి, ఎస్.శ్రీధర్‌రెడ్డి, కృష్ణయ్య, జిల్లా ట్రైనర్స్ సైదయ్య, నందకుమార్, అప్పలరాజు, సత్తెనపల్లి డివిజన్ ఎంసీ మధుబాబు, యూనిట్ ఇన్‌చార్జిలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల న్యాయ సదస్సు

చిలకలూరిపేట: విద్యుత్ సమస్యల పరిష్కారవేదిక ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల న్యాయ సదస్సు మంగళవారం నిర్వహిస్తున్న ట్లు గుంటూరు టౌన్–2 విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు తెలిపారు. పట్టణంలోని కృష్ణమహల్ సమీపంలో ఉన్న సింగు ఫంక్షన్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ న్యాయ సద స్సు నిర్వహించబడుతుందన్నారు. చిలకలూరిపేట, యడ్లపాడు, గణపవరం, గుంటూరు టౌన్–2 డివిజన్ పరిధిలోని జోకిపత్రు, ఫిరంగిపురం, పత్తిపాడు, వట్టి చెరుకూరులకు సంబంధించిన విద్యుత్ సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చు తగ్గులు, మీటర్ సమస్యలు, బిల్లింగ్, విద్యుత్ సరఫరాకు సంబంధించి అన్ని సమస్యలు రాత పూర్వకంగా ఇస్తే సత్వరమే పరిష్కరించబడతాయన్నారు. ఈ సదస్సులో విశ్రాంత జిల్లా న్యాయమూర్తి, విద్యుత్ సమస్యల పరి ష్కార వేదిక చైర్మన్ ఎస్.విక్టర్ ఇమానియేల్, సాంకేతిక సభ్యులు ఎస్.శ్రీనివాస్, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర్య సభ్యురాలు ఎ.సునీత, సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంనీర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొ ని సమస్యలు పరిష్కరిస్తారని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యడ్లపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ నియామకం

యడ్లపాడు: మండలంలోని సందెపూడికి చెందిన మద్దినేని వెంకట సుబ్బారావు ఐదవసారి సొసైటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. యడ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా మద్దినేని వెంకట సుబ్బారావు, సభ్యులుగా మిరియాల నాగేశ్వరరావు, యనగందుల వీరాంజనేయులు నియమితులైనట్లు వెల్లడించారు. సోమవారం స్థానిక సొసైటీలో వీరు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సొసైటీ సెక్రటరీ శ్రీనివాసరావు, సిబ్బంది, టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ, మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com